క్లుప్తంగా

'స్పందన' రద్దు

యల్లనూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ప్రజలు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ముమ్మరంగా ఫాగింగ్

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో దోమల నివారణకు ఆదివారం మున్సిపల్ ఏఈ శరత్ చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్యల నేతృత్వంలో శానిటేషన్ సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్ వర్కర్లు మురుగుకాలువలు, చెత్తా చెదారం పేరుకుపోయిన ప్రాంతాలు, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వాల్మీకి శివ, ఫరూక్, కేవీ రమణ, వరదరాజులు, ఖాజా ఖాన్, వెంకట సుబ్బయ్య, సచివాలయ హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

అలజడులు సృష్టిస్తే చర్యలు తప్పవు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

యాడికి: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలుగుతూ ప్రశాంత జీవనం గడపాలన్నారు. ప్రజలు ఎవరైనా మీ నుంచి ఇబ్బందులు పడుతున్నామని తమ దృష్టికి వస్తే వారిని ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ ప్రాక్టికల్స్

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో ఆదివారం ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ సజావుగా సాగాయి. బైపీసీ చదువుతున్న 20 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరైనట్లు ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు.

2న మహాధర్నా

గుంతకల్లు: టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందించాలని, జగనన్న కాలనీల ఇళ్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మార్చి 2న విజయవాడలో మహాధర్నా చేపడుతున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, పట్టణ, మండల కార్యదర్శులు ఎస్.గోపీనాథ్, రాముడాయల్ తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు ఈశ్వరయ్య, దేవేంద్ర, వినోద్‌కుమార్, అఖిల్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి



నడిమిదొడ్డి ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాఘవరెడ్డి

నార్పల: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ రాఘవరెడ్డి ప్రజలకు సూచించారు. ఆయన ఆదివారం నడిమిదొడ్డి గ్రామంలో ప్రజలకు మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట, నేరాలు, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్యాక్షన్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. చట్టవిరుద్ధ పనులకు దూరంగా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాదృక్పథం అలవర్చుకోవాలి

గుంతకల్లు: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పాతగుత్తి రోడ్డులోని అమృత వర్షిణి బాల కల్యాణం ఆశ్రమంలోని బాలలకు డాక్టర్ వేల్పూరు ప్రభాకర్ సహకారంతో టూత్ పేస్ట్, బ్రష్, సబ్బులు, కొబ్బరినూనె ఉచితంగా అందజేశారు. అవోపా పట్టణ అధ్యక్షుడు చెన్నకేశవులు, నాయకులు రాజారమణ, జయంతి వెంకట్, సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సమావేశం జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని అనిమిరెడ్డి ఫ్యాక్టరీలో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్‌రెడ్డి కోరారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రామలింగప్ప సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పెద్దెత్తున పాల్గొనాలని కోరారు.

ఆదర్శం అదరహో

- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న పుట్లూరు ఆదర్శ పాఠశాల
- తొమ్మిదేళ్లలో ఎన్‌ఎంఎంఎస్, ట్రిపుల్ ఐటీలకు 75 మంది ఎంపిక
- క్రీడల్లోనూ సత్తా చాటుతున్న విద్యార్థులు
- రూ.42 లక్షలతో పాఠశాలలో వసతులు



పుట్లూరు ఆదర్శ పాఠశాల



ఆదర్శ పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్

పుట్లూరు: కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా అధునాతన భవనాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన వసతులు, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో కూడిన పుట్లూరు ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలు అదరహో అనిపిస్తున్నాయి. 2013లో ప్రారంభమైన పాఠశాలలో అడ్మిషన్ కోసం పెద్ద ఎత్తున పోటీ ఉందంటే అతిశయోక్తి కాదు

విద్యార్థులకు వరం..

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఆదర్శ పాఠశాల వరంగా మారింది. ఈ పాఠశాలలో సృజనాత్మక, పరిశీలనాత్మక, క్రీడా పద్ధతులలో బోధన చేపడుతున్నారు. అలాగే చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి నుంచి సైతం మెరుగైన ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. 2013లో ప్రారంభమైన పాఠశాలలో ప్రస్తుతం 6 నుంచి 12వ తరగతుల వరకు 523 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పుట్లూరు మండలంతో పాటు తాడిపత్రి, పెద్దపప్పూరు, నార్పల, శింగనమల మండలాల నుంచి సైతం విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారు.

ఎన్‌ఎంఎంఎస్, ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో హవా..

ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్, ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో సైతం సత్తా చాటుతున్నారు. పాఠశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)కు 56 మంది ఎంపికయ్యారు. అలాగే ట్రిపుల్ ఐటీకి పాఠశాల నుంచి 19 మంది ఎంపిక కాగా, ఆర్టీటీకి 15 మంది విద్యార్థులు ఎంపిక కావడం గమనార్హం.

నాడు–నేడుతో మెరుగైన వసతులు

పేదల బతుకులను మార్చే ఏకైక సాధనం విద్య ఒక్కటే అని బలంగా నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు కింద అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా ఆదర్శ పాఠశాలలో రూ.42 లక్షలతో నాడు–నేడు పనులను ప్రభుత్వం చేపట్టింది. ఈ పనుల ద్వారా తాగునీరు, ఫర్నీచర్, టాయిలెట్స్, గ్రీన్ బోర్డ్స్, రూ.10లక్షలతో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు రూపొందిస్తున్నారు. విద్యతో పాటు క్రీడల్లో సైతం ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. ఇప్పటి వరకు 12 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, చెస్, టెన్నికాయిట్, వెయిట్‌లిఫ్టింగ్, తైక్వాండో తదితర పోటీలలో రాణిస్తున్నారు.

ఉపాధ్యాయుల సహకారంతో ఉత్తమ ఫలితాలు



పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. వారి ప్రతిభ, అంకితభావంతో పాటు విద్యార్థుల ఆసక్తితో మంచి ఫలితాలు సాధ్యమవుతున్నాయి. పాఠశాలలో విద్యార్థులకు పోటీ పరీక్షలపై ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు వారికి ఆయా పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగిస్తున్నాం. నాడు–నేడు కింద పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వచ్చాయి. భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలను సాధించడానికి కృషి చేస్తాం.

– ఆస్మా సయోద, ప్రధానోపాధ్యాయురాలు, ఆదర్శ పాఠశాల

చౌక దుకాణాల్లో జొన్నల పంపిణీ



మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్ర, డీఎస్‌వో శోభారాణి

గుంతకల్లు రూరల్: రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చౌకదుకాణాల్లో జొన్నల పంపిణీకి చర్యలు చేపడుతుందని ఆర్డీవో రవీంద్ర, డీఎస్‌ఓ శోభారాణి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ డివిజన్‌లోని తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, వీఆర్వోలు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డయాబెటీస్ బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్న తరుణంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇకపై రేషన్ షాపుల్లో జొన్నలు, రాగుల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి జొన్నల సేకరణ చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా ఎంత మంది రైతులు ఎంత విస్తీర్ణంలో జొన్న పంట సాగు చేశారు అన్న వివరాలను సేకరించి, రైతుల నుంచి జొన్న పంటను ప్రభుత్వానికి విక్రయించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యం కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంలో రైతులు కూడా భాగస్వాములు అయ్యేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. రానున్న రోజుల్లో జొన్నసాగును ప్రోత్సహించాలని సూచించారు. జొన్నలు క్వింటాకు రూ.3 వేల చొప్పున ప్రభుత్వం గిట్టుబాటు ధర అందిస్తుందని తెలియజేశారు. తహసీల్దార్ రాము, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, ఏఓ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా మూలవిరాట్



సాయిబాబాకు పూజలు చేస్తున్న తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి దంపతులు

యల్లనూరు: తిమ్మంపల్లి గ్రామంలో సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం వేకువజామున నుంచి షిర్డీసాయిబాబాకు సుప్రభాతసేవ, కాగడా హారతి, గణపతి, దత్తాత్రేయ స్వాములకు పూజలు, సాముహిక రుద్రాభిషేకం ప్రధాన అర్చకులు శేషగిరిశర్మ, రణధీర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటి పూజకు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, సతీమణి రమాదేవి, యువనాయకుడు కౌన్సిలర్ హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం సాయి పాద స్పర్శ దర్శనానికి అనుమతించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ వెంకటనాగిరెడ్డి, మాజీ సర్పంచి క్లాస్‌వన్ కాంట్రాక్టరు వెంకటనాగిరెడ్డి, వైఎస్సార్ హాస్పిటల్ అధినేత కేతిరెడ్డి మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు బాలపుల్లయ్య, వెంకటపుల్లయ్య, కేపీ నారాయణస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాతిదూలంలాగుడు పోటీలు

తిమ్మంపల్లి కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. 8 జతల వృషభాలు పోటీలో పాల్గొన్నాయి. ప్రతిభ చూపిన మొదటి 4 జతల వృషభాల యజమానులకు బహుమతులు ప్రదానం చేస్తారు. రాత్రి 8 గంటలకు నెల్లూరు శుభమస్తు ఈవెంట్స్ మెగా ఆర్కెస్ట్రా కార్యక్రమం నిర్వహించారు. సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ రామకృష్ణ, బందోబస్తు పర్యవేక్షించారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి జయంతి



అలంకరణలో రాఘవేంద్రస్వామి



జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

తాడిపత్రి టౌన్: స్థానిక గాజుల క్రిష్టప్పవీధిలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాఘవేంద్రస్వామి నామస్మరణతో మార్మోగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి 427 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయంలోని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి క్షీర, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చారణలు, సంప్రదాయ వాయిద్యాల మధ్య జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామి ఉత్సవ విగ్రహాన్ని పూలదండలతో ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భూమా హరినారాయణ, ఆదినారాయణరెడ్డి, చంద్రశేఖర్, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

సమయం వృథా చేయొద్దు



టెస్ట్ మోడల్ పరీక్ష ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

గుత్తి: సమయం(కాలం) చాలా విలువైందని, వృథా చేయొద్దని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్, సామాజిక సేవకురాలు వీకే పద్మావతమ్మ అన్నారు. పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కాలేజీలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ ఆధ్వర్యంలో 10వ తరగతి మోడల్ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు మండలంలోని సుమారు 650 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీకే పద్మావతమ్మ మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయని, ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. అంతకు ముందు ప్రశ్నపత్రాలను వీకే పద్మావతమ్మ, రమేష్, కాలేజీ సీఈఓ శ్రీరాములు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఊరి దేవర



నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి

పామిడి: అక్కజాంపల్లి గ్రామంలో ఆదివారం ఊరి దేవర ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి హాజరై గ్రామ దేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన పార్టీ విషయాలపై మండల నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దత్తు, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి బీ రమణారెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, మండల సచివాలయ పట్టణ, రూరల్ కన్వీనర్లు బీ ఆసిఫ్, ఎం కుమార్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్ రెడ్డి, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

తాడిపత్రి టౌన్: స్థానిక టైలర్స్‌కాలనీలోని ప్రకాశం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాల 1992–92 బ్యాచ్ విద్యార్థులు దాదాపు 30 ఏళ్ల తర్వాత కలవడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. ప్రస్తుతం ఎవరు ఎక్కడ ఏం చేస్తున్నారో తెలుసుకున్నారు. అనంతరం ఆనాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులు జ్ఞాపికలు, పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు రమాదేవి, సరస్వతి, భవాని, నరసింహారెడ్డి, రామనాథ్, జయకృష్ణ, వినయ్, చంద్రశేఖర్, రంగనాథ్, మురళీ, రాము, నాగేశ్వరరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఇలవేల్పు నాగలింగేశ్వరుడు

- 6న ఉత్సవాలు ప్రారంభం
- 7న లంకా దహనం



నాగలింగేశ్వరస్వామి మూలవిరాట్



నీలంపల్లిలో వెలసిన నాగలింగేశ్వరుని ఆలయం

బుక్కరాయసముద్రం: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో నీలంపల్లి నాగలింగేశ్వర స్వామి దేవస్థానం ఒకటి. ఇక్కడ నాగలింగేశ్వరస్వామిని భక్తులు సాక్షాత్తు పరమేశ్వరునిగా కొలుస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి అనాథరక్షకుడిగా విరాజిల్లుతున్నాడు. ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజున నాగలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే భక్తులు కోర్కెలు సిద్ధిస్తాయని ప్రతీతి. ఏటా ఫాల్గుణ మాసంలో నాగలింగేశ్వరస్వామి ఉత్సవాలు, తిరునాల అంగరంగ వైభవంగా జరుగుతాయి.

ఆలయ చరిత్ర..

జిల్లా కేంద్రానికి 12 కిలో మీటర్ల దూరంలో నీలంపల్లి గ్రామంలో పూర్వం ఎర్రినాగప్ప అనే సాధువు తిరుగుతూ గ్రామంలోకి వచ్చి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతుండేవారని పెద్దలు చెబుతున్నారు. గ్రామంలో ఆపదలో ఉన్న వారికి చిన్న చిన్న మహిమలు చూపుతూ ప్రజలకు ఆశ్చర్యచకితులను చేసేవారు. గ్రామంలో తనను జీవసమాధి చేయాలని ప్రజలతో చెప్పాడని ఆయన కోరిక మేరకు సమాధి కట్టి దానిపై చిన్న గుడి నిర్మించారు. ఈక్రమంలో ఏ కుటుంబంలో చిన్న సమస్య వచ్చినా ఎర్రినాగప్ప సమాధి వద్దకు వచ్చి పూజలు నిర్వహించేవారు. క్రమేణా గుడి పెద్దగా నిర్మించి ఎర్రినాగప్పను నాగలింగేశ్వరునిగా పిలవ సాగారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నాగలింగేశ్వరునికి ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

మొదటి పూజ నాగలింగేశ్వరుడికే...

మండలంలో ఏ ఎన్నిక జరిగినా అభ్యర్థులు నాగలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాతే ప్రచార కార్యక్రమాలు ప్రారంభించడం ఆనవాయితీ. అదే విధంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు, టీడీపీ నేత కాలువ శ్రీనివాసులు, మొదలుకుని మండలంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ఉత్సవాల వివరాలు

మార్చి 6న ఉదయం 10 గంటల నుంచి 1.30 గంటల లోపు గణపతి పూజ, పుణ్యాహ వచనం, మహా మంగళ హారతి, ప్రాకార సంప్రోక్షణ, రాత్రి 12 గంటలకు స్వామి వారి రథాన్ని గ్రామంలో ఊరేగించనున్నారు. ఇదే రోజున భక్తులకు ఆలయ కమిటీ వారు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారు. 7న ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రి 11.50 గంటల నుంచి 2.30 గంటల వరకు లంకా దహనం నిర్వహిస్తామన్నారు. రాత్రి జరిగే ఈ తిరునాలకు బీకేఎస్ ఇన్‌చార్జ్ సీఐ అన్సార్‌బాషా, ఎస్‌ఐ శివప్రసాద్ బందోబస్తు నిర్వహించనున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచేగాక జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని 108 సాలగ్రామ శివలింగాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇలా చేయడం వల్ల కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. స్వామి మూలవిరాట్ అడుగున ఉన్న నీటిని భక్తులు బాటిళ్లలో తీసుకెళ్లారు. ఈనీటిని సేవిస్తే సకల రోగాలు నివారణ అయితాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందించిన దృశ్యం

తాడిపత్రి టౌన్ : స్థానిక పుట్లూరు రోడ్డులోని కస్తూర్బా గాంధీ విద్యాలయం (జనరల్) ఇంటర్ విద్యార్థినులకు ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థినుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో సామాజిక సేవా సంస్థ కో కన్వీనర్ ఎం. రంగయ్య సహకారంతో పరీక్ష సామగ్రి అందించామని అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి శంకర్ తెలిపారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ మునెమ్మ, సేవా సంస్థ మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి గుర్రప్ప, సభ్యులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఆదివారం కారును మరోకారు ఢీకొన్ని ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు అనంతపురం వెళ్తున్న కారు వెనుక నుంచి మరో కారు ఢీకొంది. వెనకున్న కారు ముందు భాగం దెబ్బతినింది. కార్లలో ఉన్న వారు సురక్షితంగా బయట పడ్డారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొనింది. వివరాలు.. ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లో నుంచి బయటకు వస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ బస్సు ఢీ కొనింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అయితే బస్సు ముందు అద్దాలు పగిలిపోయాయి. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలోని డ్యాం రోడ్డుపై ఆదివారం రైల్వేగేట్‌ను ఆటో ఢీకొన్న సంఘటనలో ప్రమాదం తప్పింది.స్థానికుల వివరాల మేరకు.. బెండకాయల లోడ్‌తో వస్తున్న ఆటోకు బ్రేక్ ఫెయిల్ కావడంతో రైల్వేగేట్‌ను ఢీకొంది. రైల్వేగేట్ హుక్స్ ఓపెన్ కావడంతో గేట్ పైకి వెళ్లి తిరిగి ఆటో మీదపడడంతో ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలయ్యాయి. రైల్వే గేట్ స్ట్రక్ కావడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే రైల్వే అధికారులు స్పందించి రైల్వే గేట్‌కు మరమ్మతు చేసి రాకపోకలు పునరుద్ధరించారు.

నేడు ఈ-వేస్ట్ సేకరణ



ఈ-వేస్ట్ వస్తువులను ప్రదర్శించిన దృశ్యం

గుంతకల్లు: ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ–వేస్ట్) సేకరణ, అవగాహన కార్యక్రమాన్ని సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రేణుక, కే.జ్యోతి తెలిపారు. ఆదివారం లయన్స్‌క్లబ్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, కరెంట్ లేక బ్యాటరీతో చెడిపోయిన వస్తువులు ఈ-వేస్ట్ కిందకు వస్తాయన్నారు. టీవీ, ఫ్రిడ్జ్, ఏసీ, మొబైల్ చార్జ్‌లు, కంప్యూటర్లు, టీవి రిమోట్స్, పిలల్లు ఆడుకోనే ఎలక్ట్రానిక్ బొమ్మలు తదితర వాటిని సేకరిస్తామన్నారు. పట్టణంలో ఆరు ప్రాంతాల్లో ఈ-వేస్ట్‌ను సేకరించడంతో పాటు వాటి వల్ల కలిగే నష్టాలపై మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులతో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈసందర్భంగా వారు ఈ వేస్ట్‌ను ప్రదర్శించారు. లయన్స్ క్లబ్ కోశధికారి గోపాలత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గార్లదిన్నె: రామ్‌దాసుపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. పామిడి 108 సిబ్బంది వివరాల మేరకు.. అనంతపురము జీసస్ నగర్‌కు చెందిన నవీన్ పని నిమిత్తం బైక్‌పై పామిడికి బయలుదేరాడు. రామ్‌దాసుపేట వద్దకు రాగానే ఆటో ఢీకొన్నాడు. ఘటనలో గాయపడిన నవీన్‌ను 108 వాహనంలో అనంతపురం తరలించారు.